## క్లుప్తంగా

### ఇంటి పన్ను చెల్లించాలి



మేనేజర్ నాగరాజుకు పన్ను చెల్లిస్తున్న వ్యాపారులు

రాజాం: ఇంటి పన్నును సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు పట్టణ వాసులకు సూచించారు. మిత్తిరెడ్డి సచివాలయ పరిధిలోని ప్రజలు, వ్యాపారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరు నెలలకు ఒకసారి పన్ను చెల్లించడం వల్ల పన్నుభారం తగ్గడంతో పాటు వడ్డీ రాయితీ వర్తిస్తుందని చెప్పారు. అనంతరం పలువురు వ్యాపారులు పన్ను చెల్లించారు.

### గణేశ్ లడ్డు రూ.20,100



రూ.20,100వేలు పలికిన గణేష్ లడ్డు

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని వద్ద పెట్టిన లడ్డు వేలం పాటలో రూ.20వేల 100లు ధర పలికింది. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా లడ్డూను ఉత్సవ కమిటీ సభ్యులు వేలం వేశారు. వేలం పాటలో గ్రామానికి చెందిన చేపేన కుమారి రూ.20వేల 100లకు వేలం పాడుకొని దానిని సొంతం చేసుకున్నారు.

### నవధాన్యాల సాగుతో భూసారం



బూరాడలో నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న ఏడీఏ, తదితరులు

రేగిడి: రైతులు ఖరీఫ్‌కు ముందు నవధాన్యాలను సాగు చేసుకుంటే భూమి సారవంతమవుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ చంద్రరావు అన్నారు. మండలంలోని బూరాడ, కొర్లవలస, మునకలవలస, తదితర గ్రామాల్లో రైతులు వేసిన నవధాన్యాల సాగును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భూమి సారవంతంగా ఉంటేనే నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జి. మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


### తనిఖీలు



రికార్డులు తనిఖీచేస్తున్న ఎంఈఓలు

రేగిడి: మండలంలోని లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు చిన లింగాలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓలు ఎంవీ ప్రసాదరావు, బి. ఎరకయ్యలు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును, వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వారంలో ఒక రోజు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో భోజనం చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం దాసరి కృష్ణారావు, సీఆర్ఎంటీ కె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



బొద్దాంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో ఏఎన్ఎం యోగీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ దేవమణి, ఆశా కార్యకర్తలు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శుక్రవారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురికి రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

# విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఉమాలక్ష్మి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అన్ని విద్యుత్ సమస్యలను సంబంధిత శాఖ అధికారులు సకాలంలో పరిష్కరించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖపై నిర్వహించిన సమీక్షలో కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు మాట్లాడుతూ నాలుగు సర్వసభ్య సమావేశాల నుంచి కూనాయవలస, జన్నివలస గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరినా ఎటువంటి ఫలితం లేకయిందన్నారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఉందన్నా సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లోఓల్టేజీ సమస్యపై, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాల మార్పుపై మండలంలోని పణుకువలస, పాములవలస, కాగాం, చీకటిపేట, గంగన్నపాడు గ్రామాల సర్పంచులు సంబంధిత అధికారులపై ధ్వజమెత్తారు. దీనిపై స్పందించిన ఎంపీపీ విద్యుత్ సమస్యలు సకాలంలో పరిష్కరించాలని ఆ శాఖ ఏడీఏ భానునాయుడు, ఏఈ జోగినాయుడులను ఆదేశించారు. విద్యుత్‌శాఖ ఏడీఏ మాట్లాడుతూ లోఓల్టేజీ సమస్య, శిథిలమైన విద్యుత్ స్తంభాల మార్పు చేసేందుకు రూ.10లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖపై సమీక్ష నిర్వహించగా మండలానికి జేజేఎం ఫేజ్-2 కింద 22 పనులు మంజూరయ్యాయని, త్వరలో టెండర్లు పూర్తయిన వెంటనే ఆయా గ్రామాల్లో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించగా ఈ-క్రాప్ నమోదు 92శాతం పూర్తయ్యిందని, మిగిలిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకొనేలా ప్రజాప్రతినిధులు తెలియజేయాలని ఆ శాఖ ఏఓ సునీల్‌కుమార్ తెలిపారు. వైద్య శాఖపై జరిగిన సమీక్షలో తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల వైద్యులు రెడ్డి శ్రీనివాసరావు, మాధవి మాట్లాడుతూ శనివారం నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రమాదేవి, తహసీల్దార్ రత్నకుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఎంపీపీకి సన్మానం**

మండల పరిషత్ అధ్యక్షురాలిగా నర్సుపల్లి ఉమాలక్ష్మి పదవీ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమెతో పాటు వైస్ ఎంపీపీ రమాదేవిని స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు.

# అందరి సహకారంతో అభివృద్ధి



లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు
- పాగిరిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాజాం: ప్రజలు, అధికారుల అందరి సహకారంతోనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని పాగిరిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. అలాగే వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉండడంతో ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికారులు, ప్రజలు జగన్ మోహన్‌రెడ్డికి సహకరించారని.. భవిష్యత్‌లో కూడా సహకరించాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చేందుకు కుట్రలు పన్నుతోందని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కోట్ల రూపాయల స్కామ్ చేసి జైల్లో ఉన్నారని తెలిపారు. నిరుద్యోగ యువత పేరుతో దోచుకున్న డబ్బుకు శిక్ష అనుభవిస్తున్నారని, ఇవే కాకుండా 2014 నుంచి 2019 వరకూ సీఎం హోదాలో దోచుకున్న డబ్బుకు, చేసిన తప్పులకు శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్లు చిన్నంనాయుడు, స్థానిక సర్పంచ్ పాగిరి కృష్ణవేణి, పాగిరి లెనిన్, వండాన కుమారస్వామి, పాగిరి లక్ష్మునాయుడు, చింత రమణ, కామోదుల శ్రీరంగంనాయుడు, పాగిరి వెంకటరమణ, జడ్డు నరేంద్ర, ఎల్.అప్పలనాయుడు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పంచాయతీ విస్తరణ అధికారి వావిలపల్లి శ్రీనివాసరావు, ఏపీఓ సాయిరాం, ఏపీఎం దధికుమార్, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, వీఆర్‌ఓ లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా జగన్ ప్రభుత్వం



రూ.12.75లక్షల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిరునామాగా నిలిచిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేటలో రూ.12.75లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించే పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ప్రజలు కోరిన అభివృద్ధి పనులను మంజూరు చేశామని, ఆ పనులనే త్వరగా నిర్మించాలని తలపెట్టి శంకుస్థాపన చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, ఒక మున్సిపాలిటీ పరిధిలో పనులు చేపడుతున్నట్టు చెప్పారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ ఛైర్మన్ రమాదేవి, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఇంటి గోపాలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు శంబంగి వేణుగోపాల నాయుడు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, వైఎస్సార్‌సీపీ యువనేత శంబంగి శ్రీకాంత్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ తెంటు పార్వతి, కౌన్సిలర్ కె.రామారావు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పోటీ పరీక్షలు

రేగిడి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్థానిక సత్యసాయి భజన మండలి వివిధ పోటీ పరీక్షలు నిర్వహించింది. ఈ సందర్భంగా భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ మాట్లాడుతూ, సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో బాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్లా ఈ పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు సత్యసాయి జయంతి రోజున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

### బొబ్బిలిలో భారీ వర్షం



భారీ వర్షానికి కాలేజ్ రోడ్డుపైకి చేరిన నీరు

బొబ్బిలి: పట్టణం, చుట్టుపక్కల మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రాజా కాలేజ్ రోడ్డు, బజారు, ఎన్టీఆర్ కూడలి ప్రాంతాల్లో వర్షపు నీరు వరదలై పారింది. దాదాపు గంటకు పైగా కురిసిన వర్షపు నీరు డ్రైనేజీల నుంచి వెళ్లేందుకు చాలా సమయం తీసుకుంది.

### రక్తదాన శిబిరం

బాడంగి: స్థానిక సీహెచ్‌సీలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సేవా క్యాడ్ పక్షోత్సవాల్లో భాగంగా పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గల రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ఆరోగ్య శాఖ కమిషనర్ ఆదేశాలతో అన్ని సీహెచ్‌సీల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటి వరకు ఏడు శిబిరాల ద్వారా సుమారు 260 మంది నుంచి రక్త సేకరణ చేసినట్టు చెప్పారు. శిబిరంలో సీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి కాశీవిశ్వనాథ్, ల్యాబ్ టెక్నీషియన్లు నాయుడు, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

### నీటి వనరులో సాంకేతిక సమస్య

బొబ్బిలి: పట్టణానికి తాగునీటిని అందించే భోజరాజపురం హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద శుక్రవారం రాత్రి సాంకేతిక సమస్య ఏర్పడింది. అక్కడి సర్క్యూట్ బోర్డులో సమస్య రావడంతో పంపింగ్ నిలిచిపోయింది. దీంతో పురపాలక ఇంజినీరింగ్ సిబ్బంది వెంటనే వెళ్లి అక్కడ మరమ్మతు పనులు చేపడుతున్నారు. శనివారం తాగునీటి సరఫరా జరుగదని ప్రజలు గమనించాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దానగుణాన్ని అలవర్చుకోవాలి..



దత్తపీఠంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామానుజదాసు

రేగిడి: ప్రతి ఒక్కరూ ఇతరులకు సహాయాన్ని అందించే దానగుణాన్ని అలవర్చుకోవాలని గుంటూరు జిల్లా లంబూరు కాశీ వనాశ్రమం పీఠాధిపతి శ్రీనివాస రామానుజదాస్ అన్నారు. రేగిడి దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణ ఆధ్వర్యంలో దత్త జ్ఞాన బోధ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామానుజదాస్ మాట్లాడుతూ, అహంకారాన్ని వదులుకుని జ్ఞానాన్ని గ్రహించి, నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తూ కైవల్యాన్ని పొందాలని సూచించారు. మానవజన్మను సార్థకం చేసుకుని తరించాలన్నారు. మానవసేవే-మాధవసేవగా భావించి ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం దత్తపాదుక పూజ, గణపతిహోమం, ఆధ్యాత్మిక వక్తలకు సత్కారాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు మాస్టారు, కిమిడి సూరపునాయుడు, జడ్డు జగ్గారావు, యర్రాపాత్రుని భాస్కరరావు, కుదుటుల మురళి, తూతి బాలకృష్ణ, జల్లు శివ, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పరామర్శ



వెంకటరత్నం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దూబ వెంకటరత్నం కుటుంబ సభ్యులను రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు శుక్రవారం పరామర్శించారు. వెంకటరత్నం ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని వెంకటర్నతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మృతురాలి కుమారుడు దూబ వెంకట నాగార్జునబాబు, అల్లుడు మామిడి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, మామిడి సూర్యతేజ, దూబ రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

### వైద్యశిబిరాలకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

బాడంగి: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల విజయవంతానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. మండల పరిషత్‌సమావేశ మందిరంలో సర్పంచులు, ఎంపీటీసీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు శనివారం నుంచి అక్టోబర్ 26 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజాప్రతినిధులు శిబిరాలకు తమ వంతు సహకరించాలని కోరారు. తహసీల్దార్ అజురఫీజాన్, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, ఏఓ రామలింగేశ్వరరావు, వాడాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరత్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**ఇంటింటా రక్తపరీక్షలు..**

రాజాం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణ పరిధి మల్లికార్జునకాలనీలో వైద్యసిబ్బంది ఇంటింటా పర్యటించి రక్త పరీక్షలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య డేటాను మొబైల్ యాప్‌లో నమోదు చేశారు.

# ప్రజల చెంతకు వైద్యసేవలు

- ఎమ్మెల్యే శంబంగి



బొత్సవానివలసలో విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని బొత్సవానివలసలో రూ.20.8 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించబడ్డ విలేజ్ క్లినిక్ భవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగనన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా వైద్యానికి పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే 104 ద్వారా దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు, చికిత్సలు, మందులు ఉచితంగా అందిస్తుండగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రతీ ఇంటికీ వైద్యం అందిస్తున్నారన్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పించే వినూత్న కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీపీ భోగి గౌరి, ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూధనరావు, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకట నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు, ఎంపీడీఓ ఆంజనేయులు, తహసీల్దార్ అజు రఫీజాన్, ఏఈ రమేష్, వెల్నెస్ సెంటర్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 305 క్వింటాళ్ల బియ్యం వేలం



బియ్యం వేలంలో పాల్గొన్న అధికారులు, ఔత్సాహికులు

తెర్లాం: మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో తహసీల్దార్ డి.రత్నకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 305 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వేలం సజావుగా ముగిసింది. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల్లో 6ఏ కేసుల్లో సీజ్ చేసిన బియ్యాన్ని వేలం వేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రూ.2వేలు ధరావత్తు చెల్లించిన ఔత్సాహికులు వేలంపాటలో పాల్గొన్నారు. జేసీ ఆదేశాల మేరకు కేజీ ధరను పౌర సరఫరా శాఖ డిప్యూటీ తహసీల్దార్లు ప్రకటించి వేలంను ప్రారంభించారు. వేలం పాటలో పాల్గొన్న మెరకముడిదాం మండలానికి చెందిన బూర్లె సురేష్‌కుమార్ అనే వ్యక్తి కేజీ రూ.26లు చొప్పున 305 క్వింటాళ్ల బియ్యాన్ని రూ.7.93లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. వేలం పాటలో బొబ్బిలి సీఎస్‌డీటీ సాయి, తెర్లాం హెచ్‌డీటీ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి

- కమిషనర్ శ్రీనివాసరావు



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

బొబ్బిలి: జగనన్న కాలనీలోని ఇళ్లను, స్వంత స్థలాల్లో కట్టుకుంటున్న ఇళ్లను వర్చువల్ పద్ధతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చే నెల 5న ప్రారంభించే అవకాశముంది కనుక ఇళ్లను ప్రారంభానికి సిద్ధం చేయాలని కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హౌసింగ్, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, గృహనిర్మాణ శాఖ అధికారులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల వారీగా ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి? ఇంకెంత మంది చివరి దశ పనులు చేస్తున్నారన్న వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించారు. ఏఈ అల్లు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేడు పినతాడివాడలో వైద్యశిబిరం

దెంకాడ: మండలంలోని పినతాడివాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూపారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉన్నత స్థాయిలో వైద్యం అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

**హంజరాంలో...**

సంతకవిటి: మండలంలోని హంజరాంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమలో భాగంగా శనివారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్పెషలిస్టు వైద్యులు హాజరవుతారని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## సంక్షిప్తంగా...

**5న ఉక్కు పరిరక్షణ బహిరంగ సభ**

బొబ్బిలి: ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వచ్చే నెల 5న విశాఖ కూర్మన్నపాలెం గేటు వద్ద నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు పొట్నూరు శంకర రావు, ఎస్ శ్రీనివాసరావు కోరారు. సీపీఎం కార్యాలయంలో దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**అట్టహాసంగా వినాయక నిమజ్జనం**

రామభద్రపురం: మండలంలోని పలు ప్రాంతాలలో గణనాథులను శుక్రవారం ఆయా కమిటీ సభ్యులు ఘనంగా ఊరేగింపు చేపట్టారు. పలు వీధులలోని గణపతి విగ్రహాలను మేళతాళాలతో అంగరంగ వైభవంగా తిరువీధి నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని చొక్కాపు వీధి, కరిష్ణవీధి, పొందూరువీధికి చెందిన గణపతి కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ళ, బిందెల డ్యాన్సులు, కోలాటం, నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.మహిళలు సైతం తీన్మార్ నృత్యాలు చేశారు.

**విద్యార్థుల ర్యాలీ**

సంతకవిటి: మండల పరిధిలోని మందరాడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు 'నా మట్టి- నా దేశం' పేరుతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రవిశంకర్ మాట్లాడుతూ, అమరవీరులు చేసిన దేశ సేవను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.నాగభూషణరావు, అప్పలనాయుడు, గౌరినాయుడు, జాఫర్, సీతారాం, పాపారావు, కుమారి, ప్రతాప ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

**పరిశీలన**

రాజాం సిటీ: మండల పరిధి రాజయ్యపేట ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ బాసూరి శంకరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వంటకాలను రుచిచూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వడ్డించాలని, వేడినీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**క్లాప్‌మిత్రలకు సన్మానం**



క్లాప్‌మిత్రలను సన్మానిస్తున్న నిర్వాహకులు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్టణం పంచాయతీ పరిధిలో క్లాప్‌మిత్రలుగా పనిచేస్తున్న గ్రీన్ గార్డు, గ్రీన్ అంబాసిడర్లను స్వచ్ఛతా హే సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.గణపతిరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

**గుండె వ్యాధులపై అప్రమత్తం**

రాజాం సిటీ: గుండె సంబంధిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని రొటేరియన్ సప్పటి వసంతరావు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మండల పరిధి గురవాం కస్తూరీబా గాంధీ పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంక్ ఫుడ్ ధూమపానం, మద్యపానం వంటి అలవాట్ల వల్ల చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓ పి. సావిత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పక్కాగా జగనన్న భూ హక్కు పత్రాలు**



ఈకేవైసీని పరిశీలిస్తున్న డీటీ సుందరరావు

వంగర: గ్రామాల్లో రైతులకు జగనన్న భూహక్కు పత్రాలను పక్కాగా జారీచేస్తామని డీటీ పోరాడ సుందరరావు తెలిపారు. మండల పరిధిలోని రుషింగి గ్రామంలో జగనన్న భూహక్కు పథకంలో గుర్తించిన రైతులకు చేపట్టిన ఈకేవైసీని శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్ యలకల శ్రీనివాసరావు, వీఆర్వో ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.